

చివ్వెంల : తిమ్మాపురంలో దుర్గామాత వద్ద పూజలు చేస్తున్న కమిటీ సభ్యులు

## దుర్గామాత అనుగ్రహం అందరిపై ఉండాలి

● జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్

బొడ్రాయిబజార్, అక్టోబర్ 15 : దేవి శరన్నవరాత్రుల సందర్భంగా పూజలు అందుకుంటూ కోరిన కోర్కెలు తీర్చే కనకదుర్గమ్మ తల్లి ఆశీస్సులు అందరిపై ఉండాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని రైతు బజార్ వద్ద చైతన్య యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ తల్లి విగ్రహం వద్ద పూజలు నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు బండారు రాజా, బైరు వెంకన్నగౌడ్, సయ్యద్ సలీం, అయుబ్‌ఖాన్, బాలకృష్ణ, రమావత్ కిశోర్, యూత్ క్లబ్ సభ్యులు దాసరి సంతోష్, తోట వెంకన్న, బూర సతీశ్, దారావత్ నాగరాజు, నోముల నాగయ్య, ఎస్.కె.అఖిల్, దాసరి సైదులు, సాయిరాం, సాయిని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



కోదాడ : అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ సతీమణి ఇందిరా

### బీఆర్ఎస్ హ్యాట్రిక్ కొంక్షిస్తూ ఎమ్మెల్యే సతీమణి పూజలు..

కోదాడ : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ హ్యాట్రిక్, ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ రెండోసారి విజయాన్ని కాంక్షిస్తూ దేవీ నవరాత్రుల సందర్భంగా స్థానిక బ్రాహ్మణ భవన్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారికి ఎమ్మెల్యే సతీమణి ఇందిరా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న సీఎం కేసీఆర్‌కు అమ్మవారి ఆశీస్సులు మెండుగా ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తూ సంక్షేమ పథకాల ఫలాలను నేరుగా లబ్ధిదారులకే అందజేస్తున్న బొల్లం మల్లయ్య యాదవ్‌ను ఎమ్మెల్యేగా తిరిగి గెలిపించేందుకు ఆశీస్సులు అందజేయాలని అమ్మవారిని వేడుకుంటూ పూజలు నిర్వహించినట్లు తెలిపారు.



నడిగూడెంలో పూజలు చేస్తున్న మహిళలు

## విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలి

● జిల్లా ఇన్‌చార్జి అంజయ్య



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి అంజయ్య

కోదాడ రూరల్, అక్టోబర్ 15 : ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలంటూ నవంబర్ 7న హైదరాబాద్‌లో నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని జిల్లా ఇన్‌చార్జి టి.అంజయ్య అన్నారు. ఆదివారం పట్టణ ఎంఎస్ కళాశాలలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 29 సంవత్సరాల మాదిగ, ఉప కులాల ఆకాంక్ష వర్గీకరణకు బీజేపీ ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎంఎస్పీ కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏపూరి రాజుమాదిగ అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో ఎంఎస్పీ వడ్డేపల్లి కోటేశ్‌మాదిగ, యలమర్తి రాముమాదిగ, చింత విజయ్‌మాదిగ, ఏపూరి సత్యరాజు, కొత్తపల్లి అంజయ్య, పిడమర్తి చిన్న వెంకట్రావ్, మల్లెపంగు సూరి, కొండపల్లి నాగరాజు, కిశోర్, సుధాకర్, బొడ్డు కుటుంబరావు, సోమపంగు బుచ్చిరాములు పాల్గొన్నారు.

## నామవరంలో ఉమ్మడి జిల్లా కబడ్డీ పోటీలు

మోతె, అక్టోబర్ 15 : మండలంలోని నామవరం గ్రామ జడ్పీహెచ్ఎస్‌లో శ్రీరామ యూత్ ఆధ్వర్యంలో దసరా పండుగను పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా కబడ్డీ పోటీలను విజయవంతం చేయాలని కమిటీ నిర్వాహకులు నరేశ్, రాంబాబు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. పోటీలు ఈ నెల 16, 17, 18 తేదీల్లో జరుగనున్నట్లు వెల్లడించారు. మొదటి బహుమతి రూ.20,116, రెండో బహుమతి రూ.12,016, మూడో బహుమతి రూ.8,016, నాలుగో బహుమతి రూ.6,016 అందించనున్నట్లు పేర్కొన్నారు.

# పల్లె ప్రగతితో మారిన కోటినాయక్‌తండా

● రూ.8 కోట్లతో తండాలో అభివృద్ధి పనులు ● హర్షం వ్యక్తం చేస్తున్న తండా వాసులు

ఆత్మకూర్.ఎస్, అక్టోబర్ 15 : గత పాలకుల నిర్లక్ష్యంతో మండలంలోని కోటినాయక్‌తండా అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి అభివృద్ధి పని చేస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పల్లె ప్రగతి కార్యక్రమంతో కోటినాయక్‌తండా రూపురేఖలు మారిపోయాయి.

### తండాలో చేపట్టిన అభివృద్ధి పనులు..

- రూ.25 లక్షలతో ఎన్ఆర్ఈజీఎస్ రోడ్ల నిర్మాణం
- రూ.20 లక్షలతో ఎఫ్‌డీఎఫ్ సీసీ రోడ్లు
- రూ.10 లక్షలతో సీఎం ఎస్‌డీఎఫ్ రోడ్లు
- రూ.లక్షతో ఎల్ఈడీ లైట్స్



సీసీ రోడ్డు, డ్రైనేజీ



ఓవర్ హెడ్ ట్యాంక్

- రూ.5.60 లక్షలతో విద్యుత్ శాఖ నిర్మాణాలు, పనులు
- రూ.29 లక్షలతో హరితహారం
- రూ.12.60 లక్షలతో వైకుంఠ ధామం
- రూ.2.45 లక్షలతో డంపింగ్ యార్డ్

### సంక్షేమ కార్యక్రమాలు..

- రూ.89 లక్షలతో 66 మందికి ఆసరా పింఛన్లు
- రూ.63 లక్షలతో 129 మందికి రైతు రుణమాఫీ
- రూ.కోటి 99 లక్షలతో 1,404 మందికి రైతు బంధు
- రూ.5 లక్షలతో ఒకరికి రైతు బీమా
- రూ.కోటి 9 లక్షలతో 30 స్వయం సహాయక సంఘాలకు రుణాలు
- రూ.8.28 లక్షలతో 69 మందికి వ్యక్తిగత మరుగుదొడ్లు
- రూ.11 లక్షలతో 11 మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్
- రూ.8 లక్షలతో 72 మందికి కేసీఆర్ కిట్లు

### మంత్రి జగదీశ్‌రెడ్డి సహకారంతో తండా అభివృద్ధి



పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా కోటినాయక్ తండా రూపు రేఖలు పూర్తిగా మారిపోయాయి. మంత్రి జగదీశ్‌రెడ్డి సహకారంతో తండాలో అన్ని పనులు కొనసాగిస్తూ అభివృద్ధిలో సాగుతున్నాం. సీఎం కేసీఆర్ ప్రభుత్వం వచ్చాక తండాలను గ్రామ పంచాయతీలుగా చేసి అభివృద్ధి చేశారు. సీఎం కేసీఆర్, మంత్రి జగదీశ్‌రెడ్డికు కృతజ్ఞతలు.

– ధరావత్ మంగ, సర్పంచ్, కోటినాయక్‌తండా

### తండాలో అన్ని బజార్లు సీసీ రోడ్లే



తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ తండాలను గ్రామ పంచాయతీలుగా చేశారు. అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న తండాలను అభివృద్ధి చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాక ముందు తండాలో ఒక్క సీసీ రోడ్డు లేదు. బజార్లు అన్ని బురదమయంగా ఉండేవి. ఇప్పుడు అన్ని వీధులను సీసీ రోడ్లుగా మార్చారు. తండాను అభివృద్ధి చేసిన మంత్రి జగదీశ్‌రెడ్డికి తామంతా రుణపడి ఉంటాం.

– ధరావత్ అమృనాయక్, కోటినాయక్‌తండా



ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

## ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం

నడిగూడెం, అక్టోబర్ 15 : బీజేపీ పాలనలో దేశంలో నిరుద్యోగ సమస్య పెరుగడాన్ని నిరసిస్తూ ప్రధాని మోదీ దిష్టిబొమ్మను డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో దహనం చేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాసాని కిశోర్ మాట్లాడుతూ.. అధికారంలోకి రాగానే ఏటా ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చి మోదీ మాట తప్పారని ఆరోపించారు. కార్యక్రమంలో జమ్మి ఎల్లయ్య, కేశగాని భద్రయ్య, నోసిన అంజి, కాసాని రాంబాబు, చైతన్య, శ్రీకాంత్, తిరుమలేశ్, వెంకి పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం

నూతనకల్, అక్టోబర్ 15 : మండలంలోని తాళ్లసింగారం గ్రామానికి చెందిన తండు సోమయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కుటుంబానికి ఆదివారం ఆ గ్రామ సర్పంచ్ చూడి లింగారెడ్డి 50 కేజీల బియ్యం, బీఆర్ఎస్ మండల నాయకుడు పన్నాల సైదిరెడ్డి రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ ఆదేశాల మేరకు ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మరికంటి పరమేశ్, వార్డు సభ్యులు యాదగిరి, గట్టయ్య, లింగయ్య, గురువయ్య, సత్తయ్య, యల్లయ్య, ముత్తయ్య పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆర్ఎంపీల నూతన కమిటీ

## ఆర్ఎంపీల నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

మునగాల, అక్టోబర్ 15 : మండల ఆర్ఎంపీల నూతన కమిటీ ఆదివారం ప్రమాణ స్వీకారం చేసింది. మండల కేంద్రంలోని గాయత్రీ విద్యాలయం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడిగా వెలిదా వెంకటప్పచారి, ప్రధాన కార్యదర్శిగా దావేపల్లి మురళీకృష్ణ, కోశాధికారిగా భిక్షంచేత ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనరసయ్య ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పోలిశెట్టి రాజేందర్, జిల్లా సహాయ అధ్యక్షుడు షేక్ రహమతుల్లా, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బెల్లంకొండ బాంగే, రాష్ట్ర నాయకుడు అనంతవరపు బ్రహ్మం, పిల్లి రాణి పాల్గొన్నారు.

## బుల్లెట్ బండి అపహరణ

చిలుకూరు, అక్టోబర్15 : చిలుకూరు బస్టాండ్ సెంటర్‌లో ఆదివారం తెల్లవారుజామున బుల్లెట్ బండి చోరీకి గురైంది. చిలుకూరు గ్రామానికి చెందిన మీసేవ నిర్వాహకుడు మండవ వీరబాబు తన బుల్లెట్ బండిని రోజువారిలానే శనివారం ఇంటి ముందు పార్క్ చేశాడు. ఆదివారం లేచి చూసేసరికి బైక్ కనిపించకుండా పోయింది. సీసీ పుటేజీని పరిశీలించగా తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో బైక్‌పై వచ్చిన ముగ్గురు వ్యక్తులు బుల్లెట్ బండిని అపహరించుకుపోయినట్లు గుర్తించారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

## ప్రజావాణి రద్దు

మునగాల, అక్టోబర్ 15 : ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని రద్దు చేసినట్లు తాసీల్దార్ ఆంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఈ నెల 16 నుంచి డిసెంబర్ 5 వరకు ప్రజావాణి రద్దు కొనసాగుతుందని వెల్లడించారు. ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.